
# మాస్టర్‌పీస్

ఆంగ్లం: ఓ. హెన్రీ

అనువాదం: కె. రజనీకాంత్



వెస్ట్ వాషింగ్టన్ జిల్లాలో వీధులన్నీ ఇరుగ్గా, వింతగా మలుపులు తిరిగి ఉంటాయి. చిత్రకారులంతా అద్దెలు తక్కువని అక్కడికి వచ్చి ఒక కాలనీగా స్థిరపడ్డారు.

ఒక మూడంతస్తుల బిల్డింగ్‌పైన స్యూ, జాన్సీలకి ఒక స్టూడియో ఉంది. స్యూ మెయిన్ నుంచి, జాన్సీ కాలిఫోర్నియా నుంచీ వచ్చారు. వాళ్లిద్దరూ 8వ నెంబరు వీధిలోని డెల్‌మోనికా హోటల్‌లో కలుసుకుని చిత్రకళ, చికోరీ సలాడ్ మొదలైన వాటిలో తమ అభిరుచులు ఒకటేనని తెలుసుకున్నారు. ధాని ఫలితమే ఈ స్టూడియో.

ఆ తర్వాత అయిదునెలలకి, నవంబరులో న్యుమోనియా ఆ కాలనీ మీద దాడిచేసింది. జాన్సీకూడా న్యుమోనియా బారినుంచి తప్పించుకోలేకపోయింది. ఆమె తన చిన్న డచ్ కిటికీలోంచి పక్క ఇంటి వైపు తొంగిచూస్తూ ఇనుప మంచం మీద పడుకుని వుంది.

డాక్టర్ స్యూని హాల్లోకి పిల్చి "ఆమెకిక ఒక అవకాశం మాత్రమే ఉంది" అన్నాడు థర్మామీటర్‌ను విదిలిస్తూ. "ఈ అమ్మాయి తనకిక నయమవదన్న అభిప్రాయానికి వచ్చేసింది. ఆమె మనసులో ఏమైనా ఉందా?"

"ఏదో ఒకరోజున బే ఆఫ్ నేపిల్స్‌ని చిత్రించాలని ఉంది, అని నాతో అంటూ ఉండేది" చెప్పింది స్యూ.

"పెయింటింగా? - నో! ఆమె మనసులో ఎవరైనా యువకుడి గురించి ఆలోచనలేమైనా ఉన్నాయా?" అడిగాడు డాక్టర్.

"యూ మీన్ బాయ్‌ఫ్రెండ్? నో! అలాంటిదేమీ లేదు."

"వెల్! అయితే ఇది నీరసమే. నేను చెయ్యగలిగింది చేస్తాను" అన్నాడు డాక్టర్ వెళ్తూ.

డాక్టర్ వెళ్లిన తర్వాత స్యూ వర్క్ రూంలోకి వెళ్లి ఏడ్చింది; ఏడుస్తూనే జపనీస్ రుమాలులోకి చీదింది. తర్వాత డ్రాయింగ్ బోర్డ్ తీసుకుని ధీమాగా విజిల్ వేస్తూ జాన్సీ రూంలోకి వెళ్లింది.

జాన్సీ అలాగే పడుకుని, మధ్యమధ్యలో మూలుగుతూ కిటికీలోంచి బైటకి చూస్తోంది. జాన్సీ పడుకుందనుకుని స్యూ విజిల్ వేయటం ఆపేసింది. స్యూ బోర్డ్ సర్దుకుని ఒక మేగజైన్ స్టోరీకి బొమ్మ వేయటం మొదలుపెట్టింది. స్యూ కౌబాయ్ బొమ్మ వేస్తుండగా చిన్న శబ్దం వినపడింది. స్యూ కంగారుగా మంచం దగ్గరకు పరిగెట్టింది. జాన్సీ కళ్లు విప్పార్చి, కిటికీలోంచి చూస్తూ అంకెలను వెనుకనుంచి లెక్కిస్తోంది.

"పన్నెండు" అంది జాన్సీ. కొద్దిసేపటి తర్వాత "పదకొండు, పది, తొమ్మిది" అంటూ "ఎనిమిది, ఏడు" అంది వెంటవెంటనే.

స్యూ కిటికీలోంచి కొంచెం ఇబ్బందిగా చూసింది. అక్కడేముందని లెక్కపెట్టడానికి? కేవలం ఒక ఖాళీ పెరడు, ఒక పాత బిల్డింగ్ తప్ప. వంకర్లు తిరిగి, వేళ్ల దగ్గర కుళ్లిపోయిన ఒక ద్రాక్షతీగ గోడసగం వరకూ పాకి ఉంది. జోరుగా వీస్తున్న చల్లగాలికి ఆకులన్నీ దాదాపుగా రాలిపోగా అది ఆ గోడకి నగ్నంగా వేళ్లాడుతోంది.

"ఏంటి డియర్?" అడిగింది స్యూ. "ఆరు" అంది జాన్సీ, గుసగుసలాడుతునట్లుగా. "ఇప్పుడవి త్వరగా రాలిపోతున్నాయి. మూడురోజుల క్రితమైతే దాదాపు వందుండేవి. వాటిని లెక్కపెట్టేసరికి నాకు తలనొప్పొచ్చేసేది. కానీ, ఇప్పుడు ఈజీగానే ఉంది. అదిగో, ఇంకోటి రాలింది. ఇంక అయిదే మిగిలాయి".

"అయిదా, ఏంటవి?"

"ఆకులు. ఆ ద్రాక్షతీగమీద. ఎప్పుడైతే దాని చివరి ఆకు రాలుతుందో, అప్పుడే నేనూ రాలిపోతాను. నాకీ విషయం మూడురోజులుగా తెల్సు. నీకు డాక్టర్ చెప్పలేదా?"

"నేనెప్పుడూ ఇలాంటి నాన్సెన్సు విన్లేదు" అంది స్యూ నిట్టూరుస్తూ.

"అయినా, నీకు న్యుమోనియా తగ్గడానికీ, ఆ ద్రాక్షతీగ ఆకులు రాలటానికీ ఏంటి సంబంధం? నువ్వు త్వరగా కోలుకుంటావని డాక్టర్ పొద్దున్నే చెప్పాడు. నువ్వు కొంచెం సూప్ తాగి, నన్ను ఈ డ్రాయింగ్ వేసుకోనిస్తే, దాన్ని ఎడిటర్‌కిచ్చేసి, నీకు పోర్ట్‌వైను, నాకు పోర్క్ చిప్సూ తెస్తాను."

"నాకు నువ్వే వైనూ తేవద్దు" అంది జాన్సీ. "అదిగో ఇంకొకటి. నో, నాకు సూప్‌కూడా వద్దు. ఇంక నాలుగే ఉన్నాయి. చీకటి పడేలోగా ఆఖరి ఆకు రాలడం చూడాలని ఉంది. ఆ తర్వాత నేనూ....."

"జాన్సీ డియర్" అంది స్యూ. ఆమె మీదకి వంగి, "నా పని పూర్తయ్యేవరకూ నువ్వు కిటికీలోంచి బైటికి చూడకుండా కళ్లుమూసుకుని పడుకుంటానని నాకు ప్రామిస్ చెయ్యగలవా?" ఈ డ్రాయింగ్‌ని రేపటిలోగా పూర్తిచెయ్యాలి. లైట్ ఉంచుతాను. లేకపోతే షేడ్స్ తేడా వస్తాయి."

"ఇంకో రూంలోకి పోయి గీసుకోవచ్చు కదా?" అంది జాన్సీ నీరసంగా.

"నేను నీ దగ్గర ఉండడమే మంచిది, పైగా నువ్వు ఎంతసేపూ ఆ ద్రాక్ష ఆకుల్ని చూడ్డం నాకిష్టం లేదు" అంది స్యూ.

"నీ పనయ్యింతర్వాత చెప్పు" అంది జాన్సీ, కళ్లు మూసుకుని పాలిపోయిన తెల్లవిగ్రహంలా పడుకుని. "ఎందుకంటే నేను ఆ ఆఖరి ఆకు రాలిపోవడం చూడాలి. ఎదురుచూసీ, ఆలోచించీ బాగా అలసిపోయాను. నాకు సంబంధించిన అన్నింటినీ వదిలించుకుని, అలా అలా ప్రయాణిస్తూ ఆ ఆకుల్లా రాలిపోవాలనుంది."

"నిద్రపో. నేను బెహ్రమన్‌ని పిల్చుకొస్తాను. గని కార్మికుని చిత్రానికి మోడల్ కావాలిగా మరి. ఒక్క నిమిషంలో వచ్చేస్తాను. అటూఇటూ తిరగడానికి ప్రయత్నించకు" అంది స్యూ.

గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్న బెహ్రమన్ ఒక ముసలి చిత్రకారుడు. అరవయ్యేళ్లు పైబడ్డ అతను చిత్రకళలో విఫలమయ్యాడు. అతనెప్పుడూ ఒక మాస్టర్‌పీస్ వెయ్యాలని కలలు కనేవాడు. బెహ్రమన్ ఎంత జిన్ తాగినా తన మాస్టర్‌పీస్ గురించే మాట్లాడేవాడు. కానీ, ఇంత వరకూ మొదలుపెట్టలేదు. అప్పుడప్పుడూ వ్యాపారప్రకటనలకు గీయటం తప్ప పెద్ద చెప్పుకోదగ్గ చిత్రాలు గీసిందీ లేదు. ప్రొఫెషనల్స్‌కి డబ్బులు చెల్లించుకోలేని ఆ కాలనీ యువచిత్రకారులంతా బెహ్రమన్‌ని మోడల్‌గా పెట్టుకుని ఎంతోకొంత ఇస్తుంటారు. అతనెప్పుడూ కాపలా కుక్కలాగా స్యూ, జాన్సీలను రక్షించే అవకాశం కోసం ఎదురుచూస్తుంటాడు.

స్యూ కిందకి దిగేసరికి బెహ్రమన్ రూంలో జునీపర్ బెర్రీల వాసన తగిలింది. ఒకమూల గత పాతిక సంవత్సరాలనుంచీ బెహ్రమన్ గీసే మాస్టర్‌పీస్‌కోసం ఎదురుచూస్తూ ఒక ఖాళీ కాన్వాస్ ఉంది. స్యూ అతనికి జాన్సీ భ్రమల గురించి వివరంగా చెప్పింది.

బెహ్రమన్ తన ఎర్రని కళ్లను మిటకరించి గట్టిగా అరిచాడు. "ఏంపీ! కుళ్లిన ద్రాక్షతీగ ఆకులు రాలిపోతే చనిపో

తామనుకునే మూర్ఖులు ఈ ప్రపంచంలో ఉన్నారా? నేనెప్పుడూ ఇటువంటి విషయాలు విన్లేదు. నో, నేను మీలాంటి మూర్ఖులకి మోడల్‌గా పనిచెయ్యను. అయినా, అలాంటి ఆలోచనలు ఆ అమ్మాయి మనసులోకి ఎందుకు రానిచ్చావు? పాపం జాన్సీ."

"తను చాలా నీరసంగా ఉంది" అంది స్యూ. "పైగా జ్వరం కూడా ఉందేమో, రకరకాల భ్రమలకు లోనవుతోంది. సరే బెహ్రామన్, నువ్వు నా చిత్రానికి ఫోజు ఇవ్వనంటే అది నీ ఇష్టం. కానీ, నేననుకునేదేంటంటే, నువ్వొక ముసలిదయ్యానివి."

"ఆడదానివి అనిపించుకున్నావు" అరిచాడు బెహ్రామన్. "ఎవరన్నారు నేను నీకు ఫోజివ్వనని. పద వస్తాను. నేను ఫోజివ్వడానికి రెడీగా ఉన్నానని నీతో చెప్పడానికి అరగంట నుంచి ప్రయత్నిస్తున్నాను. ఏదో ఒక రోజున నేనూ ఓ మాస్టర్‌పీస్ గీస్తాను. అప్పుడు కానీ ఈ ముసలిదయ్యం విలువ తెలీదు."

ఇద్దరూ పైకి వెళ్ళేటప్పటికి జాన్సీ నిద్రపోయింది. స్యూ, కిటికీ తలుపులు మూసి, బెహ్రామన్‌ని ఇంకో గదిలోకి తీసుకెళ్లింది. ఇద్దరూ భయపడుతూనే కిటికీలోంచి ద్రాక్షతీగను చూశారు. తర్వాత, మౌనంగా ఒకరినొకరు చూసుకున్నారు.

బయటగాలి మొధలయ్యింది. మంచు రజనుతో కూడిన వర్షం పడుతోంది. బెహ్రామన్ పాత నీలం షర్టు వేసుకుని, తిరగేసిన టీ కెటిల్ మీద గని కార్మికుని ఫోజులో కూర్చున్నాడు.

మర్నాడు స్యూ లేచేటప్పటికి నిస్తేజంగా కిటికీ వైపు చూస్తున్న జాన్సీ కనిపించింది. "కిటికీ ఎత్తు. నేను చూడాలి" అజ్ఞాపించింది జాన్సీ నెమ్మదిగా. జాన్సీ ఆజ్ఞను అలవాటుగా పాటించింది స్యూ.

"ఓహ్! రాత్రంతా కురిసిన కుంభవృష్టికీ, ఈదురుగాలికీ తట్టుకుని, అక్కడ గోడమీద కనబడుతోందొక ఆకు. ద్రాక్షతీగ మీద మిగిలిన చివరి ఆకు. అక్కడక్కడా పచ్చగా, అంచుల దగ్గర పసుపచ్చగా, నేలకి పన్నెండడుగుల ఎత్తులో గర్వంగా వేళ్లాడుతోందా ఆకు.

"అదే ఆఖరిది" అంది జాన్సీ. "రాత్రే అది రాలిపోతుందనుకున్నాను. ప్చ్! ఈ రోజు తప్పకుండా రాలుతుంది. అదే సమయంలో నేను చనిపోతాను."

"జాన్సీ డియర్" అంది స్యూ, జాన్సీ మంచం మీద కూర్చుంటూ. నీ గురించి నువ్వాలోచించలేకపోతే నా గురించి ఆలోచించు. అంతేకానీ, ఆ ఆకు గురించి మాత్రం ఆలోచించొద్దు."

"ఓహ్! రాత్రంతా కురిసిన కుంభవృష్టికీ, ఈదురుగాలికీ తట్టుకుని, అక్కడ గోడమీద కనబడుతోందొక ఆకు. ద్రాక్షతీగ మీద మిగిలిన చివరి ఆకు. అక్కడక్కడా పచ్చగా, అంచుల దగ్గర పసుపచ్చగా, నేలకి పన్నెండడుగుల ఎత్తులో గర్వంగా వేళ్లాడుతోందా ఆకు.
"అదే ఆఖరిది" అంది జాన్సీ. "రాత్రే అది రాలిపోతుందనుకున్నాను. ప్చ్! ఈ రోజు తప్పకుండా రాలుతుంది. అదే సమయంలో నేను చనిపోతాను".

జాన్సీ సమాధానం చెప్పలేదు.

ఆరోజు గడిచిపోయింది, కానీ వెన్నెల్లో కూడా వారికా ఆకు స్పష్టంగా కన్పిస్తోంది. కిటికీలను టపటపలాడిస్తూ మళ్లీ వర్షం మొదలయ్యింది. మర్నాడు చూసేసరికి ఆ ఆకు ఇంకా అక్కడే ఉంది. చాలా సేపటివరకూ జాన్సీ అలా కిటికీలోంచి చూస్తూ కూర్చుంది. తర్వాత, గాస్ స్టౌవ్ మీద చికెన్‌సూప్‌ని గరిటెతో తిప్పుతున్న స్యూని పిల్చి "నేను చాలా మూర్ఖంగా ప్రవర్తించాను కదూ" అంది జాన్సీ. "నేను ఎంత క్రూరంగా ఆలోచించానో తెలియచెప్పటానికే ఏదో శక్తి ఆ ఆకుని అక్కడ ఉంటేటట్టు చేసింది. చావాలని కోరుకోవటం పాపం అని నాకిప్పుడే తెలిసింది. ఇప్పుడు కొంచెం సూప్, రెడ్‌వైన్ కలిపిన పాలు ఇవ్వు. ఆహా! లేదు ముందు నాకో చిన్న అద్దం ఇవ్వు. తర్వాత, రెండు దిండ్లు కూడా తీసుకొస్తే, నేను కూర్చుని నువ్వు వంట చెయ్యటం చూస్తాను."

ఒక గంట గడిచిన తర్వాత జాన్సీ అంది "స్యూ, ఏదో ఒక రోజున నేను బే ఆఫ్ నేపిల్స్‌ని గీస్తాను."

మధ్యాహ్నం డాక్టర్ వచ్చి జాన్సీని చూశాడు. స్యూని హాల్లోకి పిల్చి, "అద్భుతం" అన్నాడు స్యూ సన్నని చేతిని షేక్ చేస్తూ. "మీరు చేసిన సపర్యలు వృధా పోలేదు. ఇప్పుడు నేనింకొక కేసు చూడాలి గ్రౌండ్‌ఫ్లోర్‌లో. బెహ్రామన్ అనీ, ఆర్టిస్ట్ అనుకుంటాను. పాపం ముసలోడు. అతనికీ న్యూమోనియా సోకింది. బతికే అవకాశం లేదు కానీ, ఈ రోజు హాస్పిటల్‌కెళ్లానుకుంటున్నాడు."

మర్నాడు డాక్టర్ స్యూతో అన్నాడు "ఇప్పుడామెకే ప్రమాదమూ లేదు. మీరే గెల్చారు. పౌష్టికాహారం, కాస్తం విశ్రాంతి, ఇవే ఇప్పుడామెకి కావల్సినవి."

మర్నాటి మధ్యాహ్నం మంచం మీద పడుకుని, ఎందుకూ పనికిరాని నీలం మఫ్లర్ అల్లుతున్న జాన్సీ మంచం దగ్గరకు స్యూ వచ్చి, ఆమె భుజం మీద చెయ్యి వేస్తూ, "నీకో విషయం చెప్పాలి జాన్సీ. ఈ రోజు హాస్పిటల్‌లో బెహ్రామన్ న్యూమోనియాతో చనిపోయాడు. రెండు రోజులుగా వంట్లో బాగోలేదట. బెహ్రామన్ తన రూంలో అసహాయస్థితిలో పడివుండటం ఎటెండరు చూశాడట. అతని బూట్లు, బట్టలు మంచుతో తడిసి ఉన్నాయట. అక్కడ ఓ వెలుగుతున్న లాంతరు, నిచ్చెన, చెల్లాచెదురుగా పడిఉన్న కొన్ని బ్రష్షులు, ఆకుపచ్చ, పసుప్పచ్చ రంగులు కలిపిన ఒక ప్లేటు కనిపించాయట" అని ఓ క్షణం ఆగి, చెమ్మగిల్లిన కళ్లతో స్యూ అంది "కిటికీలోంచి చూడు డియర్, ఆ గోడ మీద ఆఖరి ఆకుని చూడు. గాలి వీచినప్పుడు అదెందుకు కదలటం లేదా? అని నువ్వెప్పుడయినా ఆలోచించావా? డార్లింగ్, అది బెహ్రామన్ గీసిన మాస్టర్‌పీస్. ఆఖరి ఆకు రాలిన రాత్రి అతను గీసిన మాస్టర్‌పీస్."

●

# సామాజిక సేవలో 'వాసవీ క్లబ్'

కులమతాలకు అతీతంగా విభిన్న సామాజిక రంగాల్లో పని చేస్తున్న సేవా సంస్థ వాసవీ క్లబ్. విద్యా వైద్య రంగాల్లో తన వంతు కృషి చేస్తూ భాగ్యనగరంలోని పేదసాదలకు అండగా నిలుస్తున్న సంస్థ ఇది. 1961లో ఏర్పడిన ఈ సంస్థ కాలక్రమాన తన కార్యకలాపాల్ని విస్తరించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా క్లబ్ సేవా కార్యక్రమాల శైలిలోనూ మార్పులు వచ్చాయి. కనుకనే గత ఏడాది కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సా శిబిరాలను వాసవీ క్లబ్ నిర్వహించింది. కిడ్నీ పేషంట్లకు ఇతోధిక సహాయాన్ని అందించింది. ఎంసెట్ విద్యార్థుల కోసం 'మోడల్ ఎంసెట్' పరీక్షలు జరిపింది. ఈ కోవలోనే టెలివిజన్ రంగంలో పనిచేస్తున్న కళాకారుల సృజనాత్మక ప్రతిభను ప్రోత్సహించే సంకల్పంతో 'వార్త' సహకారంతో 'వాసవీ వార్త టి.వి. అవార్డులు' అందజేసింది. 1998లో వచ్చిన మంచి టి.వి. సీరియల్స్‌కు, ఉత్తమ ఫీచర్‌కు, నటుడికి, నటికి, హాస్య నటుడికి, యాంకర్‌కు, రచయితకు, దర్శకుడు, విలన్ మొదలయిన వారికి ఈ బహుమతులను అందజేశారు. ఈవిధంగా తొలిసారి టీవీ కళాకారులను అవార్డులతో సత్కరించిన ఘనత వాసవీ క్లబ్‌కు దక్కింది. విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో 'వాసవీ టాలెంట్' పేరిట ఆటల, పాటల పోటీలను నిర్వహించింది.

ఇలాంటి వినూత్న కార్యక్రమాలే కాక ఎంపిక చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు వ్యక్తిత్వ వికాసంపై ముప్పయి రోజుల కార్యక్రమాన్ని కూడా క్లబ్ ఏర్పాటు చేసింది. మృగశిరకార్తెలో బత్తిన కుటుంబం వారు ఇచ్చే మందు కొరకు హైదరాబాద్ వచ్చిన అస్తమా రోగులకు గాను వాసవీ క్లబ్ తనకు తోచిన రీతిన సహకరించింది. అదేవిధంగా నేత్ర చికిత్స శిబిరాలు నిర్వహించి 1008 మందికి ఐఓఎల్ ఆపరేషన్స్ చేయించింది. వేలాదిమంది నిరుపేదలు ఉచితంగా కంటిపరీక్షలు చేయించుకోడానికి వాసవీ క్లబ్ నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాలు తోడ్పడ్డాయి. హైదరాబాద్‌లోనే కాక రంగారెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈ శిబిరాలను నిర్వహించారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేయడమే కాక, ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వం నిర్వహించే జన్మభూమి కార్యక్రమాల్లోనూ వాసవీ క్లబ్ చురుకైన పాత్ర వహించింది. సేవయే తన ధ్యేయం కాబట్టి, ఇదే సదాశయాన్ని కలిగివున్న జన్మభూమిలో పాల్గొనడం తన బాధ్యతగా వాసవీ క్లబ్ గుర్తించింది. కనుకనే ఈ కార్యక్రమాల్లో పాల్గొంది. పెళ్ళి ఒక సమస్యగా మారిన ప్రస్తుత సమాజాన వధూ,వరుల పరిచయ సభల్ని క్లబ్ ఏర్పాటు చేసింది. దీనివల్ల తల్లిదండ్రుల శ్రమ కొంతవరకు తగ్గుతోంది.

వాసవీ క్లబ్ జాతీయ పర్వదినాల్లో, వివిధ సాంస్కృతిక దినోత్సవాల నిర్వహణలోనూ ముందు ఉంది. అంతేగాక గత ఏడాది సంస్థ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కల్వకుంట్ల చంద్రసేన గుప్తా (కె.సి.గుప్తా) అమృతోత్సవంలోనూ వాసవీ క్లబ్ కీలక పాత్ర వహించింది. హైదరాబాద్ విమోచన పోరాటంలో పాల్గొని ఆయన జైలుకు వెళ్ళారు. కేంద్ర ప్రభుత్వం ఆయన దేశభక్తికి మెచ్చి తామ్రపత్రాన్ని ఇచ్చింది. గత సెప్టెంబర్‌లో జరిగిన అమృతోత్సవం సందర్భంగా వాసవీ క్లబ్ కె.సి.గుప్తా సేవల్ని స్మరించుకుంది.

హైదరాబాద్ వాసవీ క్లబ్‌కు అధ్యక్షులుగా ఉంటున్న చీకటిమర్ల అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆలంపల్లి రవికుమార్, కోశాధికారి పెండ్యాల లక్ష్మీనారాయణ మొదలయినవారు చేస్తున్న కృషి వల్ల వాసవీక్లబ్ పేరొందిన సేవా సంస్థగా ఎదిగింది. విభిన్న సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఈ సంస్థ, ఇదేరీతిన విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించడానికి అనువైన ప్రణాళికతో ముందుకుపోతుంది.

–శ్యామ్